కొత్తమ్మతల్లి ఆలయ ఆదాయం రూ.3.63లక్షలు

కోటబొమ్మాళి/అరసవల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఆలయానికి 60రోజులకుగాను రూ.3,63,923 ఆదాయం వచ్చిందని ఈవో వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. సోమవారం ఆమదాలవలస గ్రూప్ దేవాలయాల ఈవో టి.రవికుమార్ పర్యవేక్షణలో హుండీలను తెరిచి లెక్కించారు. రూ.3.63 లక్షలతోపాటు 185గ్రాముల బంగారం, 6.15 కేజీల వెండి వస్తువులు వచ్చాయని ఈవో రాధాకృష్ణ తెలిపారు. ● అలాగే అరసవల్లి ఆదిత్యుడి హుండీల లెక్కింపు ప్రక్రియ మంగళవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో భద్రాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



నేడు ఆంధ్రజ్యోతి..
'కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రా'

స్థలం: ఎచ్చెర్ల ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో..

సమయం: ఉదయం 11.30 గంటలకు..

హాజరుకానున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



శ్రీకాకుళం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి యాజమాన్యం పాఠకుల కోసం 'కార్ అండ్ బైక్ రేస్'ను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఆంధ్రజ్యోతి 22వ వార్షికోత్సవ పురస్కారం నేపథ్యంలో శ్రీకాకుళం యూనిట్(శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం)స్థాయిలో విజేతల ఎంపిక కోసం మంగళవారం లక్కీ డ్రా తీయనుంది. ఎచ్చెర్లలోని యూనిట్ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి శ్రీకాకుళం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. లక్కీ డ్రా ద్వారా ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలతోపాటు వందమంది ప్రోత్సాహక బహుమతుల కోసం విజేతలను ఎంపిక చేస్తారు. గతేడాది నవంబరు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ప్రతి నెలా మూడు చొప్పున నాలుగు నెలలకు 12 కూపన్లు 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురించారు. ఒక్కో నెల కూపన్లు ఒక సెట్టుగా.. నాలుగు నెలలకు నాలుగు సెట్ల కూపన్లను 'ఆంధ్రజ్యోతి' యూనిట్ కార్యాలయానికి మూడు జిల్లాల నుంచి వేలాది మంది పాఠకులు కూపన్లు పంపించారు. లక్కీ డ్రా ద్వారా ఉమ్మడి జిల్లాలో మొదటి బహుమతి బైక్, ద్వితీయ బహుమతి రిఫ్రిజిరేటర్, తృతీయ బహుమతి కలర్ టీవీ, వంద మందికి కన్సొలేషన్ బహుమతులు ఇస్తారు. అలాగే త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి లక్కీడ్రాలో బంపర్ బహుమతిగా కారు గెలుచుకునే అవకాశం ఉంది.



చెరకు రైతులకు అన్నీ కష్టాలే!

● ఏటా తగ్గుతున్న సాగు విస్తీర్ణం ● ఒకప్పుడు వేల ఎకరాల్లో.. ఇప్పుడు వందల్లో..

● గిట్టుబాటు ధరలేక నష్టపోతున్న వైనం ● గత ఐదేళ్లూ అందని ప్రోత్సాహం

"మెళియాపుట్టి మండలం గొడ్డ గ్రామానికి చెందిన చందక దాలినాయుడు 15 ఏళ్లుగా సుమారు 10 ఎకరాల్లో చెరకు పండిస్తున్నాడు. ప్రస్తుతం కూలీలు లేక.. పెట్టుబడులు పెరగడం, ప్రభుత్వం రైతులు రాయితీలు సైతం ఇవ్వకపోవడంతో ఈ ఏడాది రెండు ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నాడు. బెల్లం కిలో మార్కెట్‌లో రూ.50 నుంచి రూ.60 ఉండగా, వ్యాపారులు మాత్రం రూ.30 నుంచి రూ.40లోపే కొనుగోలు చేస్తున్నారు. దీంతో నష్టపోయి.. పంటపై ఆసక్తి తగ్గుతోందని దాలినాయుడు వాపోతున్నాడు."

ఎచ్చెర్ల/మెళియాపుట్టి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అందరికీ తీపి తినిపించే చెరకు రైతుకు మాత్రం చేదే మిగులుతోంది. పెట్టుబడి వ్యయం పెరగడం.. పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లేక రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. జిల్లాలో ఒకప్పుడు వరికి ప్రత్యామ్నాయంగా చెరకు సాగు చేసేవారు. ఎచ్చెర్ల, లావేరు, పొందూరు, పోలాకి, నరసన్నపేట, మెళియాపుట్టి, పాతపట్నం, హిరమండలం, కొత్తూరు మండలాల్లో వేలాది ఎకరాల్లో చెరకు పండించేవారు. ఆమదాలవలసలో చక్కెర కర్మాగారానికి ఆ చెరకును తరలించేవారు. కాగా.. ఈ కర్మాగారం మూతపడిన తర్వాత జిల్లాలో చెరకు సాగు విస్తీర్ణం క్రమేపీ తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం గిట్టుబాటు ధర లేక, ప్రభుత్వం రాయితీలు కూడా ప్రకటించకపోవడంతో చెరకు సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. అలాగే జిల్లాలో చక్కెర కర్మాగారం లేకపోవడంతో.. విజయనగరం జిల్లాలోని సంకిలి షుగర్ ఫ్యాక్టరీకి చెరకును పంపిస్తున్నారు. రవాణాకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బెల్లం తయారీ కంటే యాత్రలు, ఆలయాల వద్ద చెరకు గెడలు విక్రయిస్తేనే తమకు లాభం వస్తోందని కొంతమంది రైతులు పేర్కొంటున్నారు.

గిట్టుబాటుకాని ధర

చెరకు క్వింటాల్‌కు రూ.290, టన్నుకు రూ.2,900 చెల్లిస్తున్నారు. ఇది ఏమాత్రం గిట్టుబాటు కావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కంటే టన్నుకు కేవలం రూ.90 మాత్రమే పెరిగింది. ఎకరా చెరకు సాగుకు రూ.20వేలకు మించి ఖర్చు చేసినా 30 టన్నులకు మించి దిగుబడి రావడంలేదని వాపోతున్నారు. చెరకు కటింగ్, రవాణాకు టన్నుకు మరో రూ.3వేల వరకు వెచ్చించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఎకరాకు 50టన్నుల వరకు దిగుబడి వస్తే తప్ప.. ప్రస్తుత రేట్లలో కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు దిగులు చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర పెంచాలని కోరుతున్నారు.

సాగు ఇలా:

జిల్లాలో చెరకు సాగు ఏటా తగ్గుతోంది. గత వైసీపీ ప్రభుత్వం చెరకు రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వలేదు. దీంతో గత ఐదేళ్ల నుంచి చెరకు సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. 2021-22లో ఖరీఫ్‌లో 1,257 హెక్టార్లు, రబీలో 807 హెక్టార్లలో రైతులు చెరకు సాగు చేశారని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. 2022-23లో ఖరీఫ్‌లో 1,033 హెక్టార్లు, రబీలో 146 హెక్టార్లలో చెరకు పండించారు. 2023-24లో ఖరీఫ్‌లో 688 హెక్టార్లు, రబీలో 62 హెక్టార్లలో మాత్రమే చెరకు సాగు చేశారు. 2024-25లో ఖరీఫ్‌లో 679 హెక్టార్లలో చెరకు పండించారు. ప్రస్తుత ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ పైపులతోపాటు బెల్లం ధరకు గిట్టుబాటు కల్పిస్తామని ప్రకటించడంతో రబీలో 102 హెక్టార్లలో చెరకు పంట వేశారని వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు.

చెరకు రసానికి డిమాండ్

చెరకు బెల్లం తయారీ కన్నా.. రసానికే డిమాండ్ ఎక్కువగా ఉంది. స్థానికులతోపాటు బీహార్, రాజస్థాన్‌కు చెందినవారు

(మిగతా 6వ పేజీలో..)



సుందరాడ వద్ద బెల్లం పాకం తీస్తున్న దృశ్యం



ఎస్.ఎం.పురం సమీపంలో కట్ చేస్తున్న చెరకు

ఏపీపీఎస్సీ పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు

● నేటి నుంచి మూడురోజులపాటు నిర్వహణ

● హాజరుకానున్న 1,304 మంది అభ్యర్థులు

● డీఆర్వో వేంకటేశ్వరరావు



మాట్లాడుతున్న డీఆర్వో వేంకటేశ్వరరావు. చిత్రంలో డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు నిర్వహించే మూడు విభాగాల పోస్టులకు సంబంధించిన పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాల'ని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ 'పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో ఏఈఈ, అలాగే ఎనలిస్ట్ గ్రేడ్-2, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పరీక్షలకు సంబంధించి మూడు కేంద్రాలను సిద్ధం చేశాం. శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజీ, నరసన్నపేట కోర్ టెక్నాలజీ కాలేజీ, శ్రీ వేంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీ కేంద్రాల్లో ఈ నెల 25 నుంచి 27 వరకు పరీక్షలు నిర్వహిస్తాం. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. 25న 545 మంది, 26న 457 మంది, 27న 302మంది మొత్తం 1,304 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలి. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలి. నిరంతర విద్యుత్ సరఫరా ఉండాలి. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఇబ్బందులు లేకుడా చర్యలు చేపట్టాల'ని ఆదేశించారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ వివేకానంద, ఏపీపీఎస్సీ ప్రతినిధులు ఈశ్వరి, పద్మప్రియ, డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ చక్రవర్తి, చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులు పాల్గొన్నారు.

కొండచీపుర్లతో సిరులు

● గిరిజనులకు ఆదాయం

● తక్కువ పెట్టుబడితో లాభాలు

● జీసీసీ సహకరిస్తే మేలు

6లో



22 కిలోల గంజాయి స్వాధీనం

● ఒడిశాకు చెందిన వ్యక్తి అరెస్ట్

8లో



క్షయరహిత దేశంగా మారుద్దాం

● సీనియర్ సివిల్ న్యాయాధికారి సన్యాసినాయుడు

● ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా చికిత్స: డీఎంహెచ్‌వో

6లో

శుద్ధ జలాలను చిదిమేశారు!

● మూతపడిన వాటర్ ప్లాంట్లు

● 'ఉద్దానం'లో ప్రమాద ఘంటికలు

● ఐదేళ్లుగా కొనసాగిన నిర్లక్ష్యం

ఇచ్ఛాపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఉద్దానం గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. చేతి పంపులు పనిచేయడం లేదు. కుళాయిల ద్వారా నీరందడం లేదు. ఉద్దానం సమగ్ర మంచినీటి పథకానికి అతీగతీ లేదు. అప్పట్లో ఉద్దానానికి శుద్ధ జల ప్లాంట్లు అండగా నిలిచేవి. రూ.2కే 20 లీటర్ల నీరు అందేది. రూ.10 పెడితే కుటుంబ తాగునీటి అవసరాలకు రోజుకు 100 లీటర్ల నీరందేది. కానీ గత వైసీపీ పాలనలో ఈ శుద్ధ జలాల ప్లాంట్లు మూతపడ్డాయి. కొద్దిపాటి ప్లాంట్లే పని చేస్తున్నాయి. 20 లీటర్ల క్యాన్‌ను రూ.7కు పెంచినా.. సరిపడా నీరందని దుస్థితి నెలకొంది. గత ఐదేళ్లూ కేవలం హిరమండలం నుంచి తెచ్చిన ఉద్దానం సమగ్ర మంచినీటి పథకం పేరు చెప్పి.. శుద్ధ జల ప్లాంట్లను పూర్తిగా నిర్వీర్యం చేశారని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **టీడీపీ ప్రభుత్వ హయాంలో..**

తాగునీరు కలుషితమే ఉద్దానంలో కిడ్నీ వ్యాధుల వ్యాప్తికి ఒక కారణమని అధ్యయనాలు తేల్చాయి. దీంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో ఎన్టీఆర్ సుజలధార పేరుతో తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. రూ.14కోట్ల వ్యయంతో శుద్ధజలాల ప్లాంట్లను ఏర్పాటు చేశారు. పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురంలో మండలానికి ఒకటి చొప్పున మదర్‌ప్లాంట్లను నెలకొల్పారు. ఏడు మండలాల్లోని 135 గ్రామాల్లో సరఫరా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మదర్ ప్లాంట్ల నుంచి సరఫరా కేంద్రాలకు శుద్ధ జలాలను తరలించేందుకు స్టీల్ కంటైనర్లతో ట్రాక్టర్ ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. 20 లీటర్ల నీటిని రూ.2కే అందించేవారు. కొన్నాళ్లపాటు ఇవి బాగానే పనిచేశాయి. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో సగానికిపైగా సరఫరా కేంద్రాలు మూతపడ్డాయి. ట్రాక్టర్లు సైతం తరచూ మొరాయిస్తున్నాయి. శుద్ధజలాల తరలింపులో తీవ్ర ఇబ్బందులు ఎదురవు తున్నాయి. వేసవి కావడంతో ప్రజలు తాగునీటి

(మిగతా 7వ పేజీలో..)



కంచిలి: బలియాపుట్టుగ కాలనీలో నిరుపయోగంగా శుద్ధ జలం ప్లాంట్

నిర్వీర్యం చేశారు

ఉద్దానంలో ఎన్టీఆర్ సుజలధార శుద్ధ జలాల ప్లాంట్ల సేవలు విస్తృతంగా అందించేవి. కానీ వైసీపీ పాలనలో నిర్వహణ లేకపోవడంతో.. నిర్వీర్యమయ్యాయి. క్యాన్ ధర పెంచినా నీరందని పరిస్థితి నెలకొంది.

- కాళ్ల దిలీప్,
22వ వార్డు టీడీపీ కౌన్సిలర్, ఇచ్ఛాపురం

మూడు మాత్రమే..

కంచిలి మండలంలో 19 శుద్ధజలాల ప్లాంట్లు ఉండగా మఖరాంపురం, కత్తివరం, శ్రీరాంపురం గ్రామాల్లో మూడు మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలినవన్నీ మూలకు చేరాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి శుద్ధ జలాల ప్లాంట్లు వినియోగంలోకి తీసుకురావాలి..

- మాదిన రామారావు,
టీడీపీ మండల కార్యదర్శి, కంచిలి

బాగు చేస్తున్నాం

శుద్ధ జలాల ప్లాంట్లను బాగు చేస్తున్నాం. వీలైనంత వేగంగా పునరుద్ధరించే చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్ఛాపురం మండలంలో 11కిగానూ 5 శుద్ధజలాల ప్లాంట్లు పని చేస్తున్నాయి.

- కె.విష్ణుమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ, ఇచ్ఛాపురం



జలమయమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్

గాలీవాన బీభత్సం

● నేలకొరిగిన భారీ వృక్షాలు

● తెగిపడిన విద్యుత్ తీగలు

● రాలిన మామిడి పిందెలు

● ఆందోళనలో రైతులు

శ్రీకాకుళం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అకాల వర్షం దంచి గొట్టింది. సోమవారం వేకువజామున 3 గంటల సమయంలో ఈదురు గాలులు బలంగా వీచాయి. వడగళ్ల వర్షం తోడై... బీభత్సం సృష్టించాయి. శ్రీకాకుళం, కొత్తూరు, హిరమండలం, పొందూరు మండలాల్లో మామిడి, మొక్కజొన్న, అరటి, వరి పంటకు తీవ్ర నష్టం కలిగింది. శ్రీకాకుళంలో అత్యధికంగా 37.25 మిల్లీ మీటర్లు వర్షపాతం కురిసింది. దీంతో రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నీరు చేరడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఇక నగరంలో మురుగునీరు.. వర్షపునీరు కలిసి రోడ్లపై ప్రవహించాయి. శ్రీకాకుళం, గార ప్రాంతాల్లో ఎక్కడికక్కడ విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పార్శిల్ సర్వీస్ విభాగంలో విద్యుత్ అంతరాయంతో సాయంత్రం వరకు సేవలు నిలిచాయి. నగరంతోపాటు.. చుట్టుపక్కల ఉన్న భారీ వృక్షాలు.. వాటి కొమ్మలు విరిగిపడ్డాయి. ఉదయం నుంచి వాటిని తొలగించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. అలాగే చాలాచోట్ల మామిడి పూత, పిందెలు రాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సోమవారం జిల్లాలో కురిసిన వర్షపాతం (మిల్లీమీటర్లలో)

శ్రీకాకుళం	37.25
కొత్తూరు	30.25
హిరమండలం	28.75
శ్రీకాకుళం రూరల్	28.0
పొందూరు	23.75
ఆమదాలవలస	15.5
పాతపట్నం	13.75
బూర్జ	8.5
రణస్థలం	7.75
ఎల్.ఎన్.పేట	5.25

మరిన్ని వివరాలు -6లో



శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నేలకూలిన చెట్టు



ఎచ్చెర్ల: పాతపొన్నాడ సమీపంలో నేలకొరిగిన వరిపంట

వర్షం తెచ్చిన కష్టం

సిక్కోలులో భారీ వర్షం

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత కురిసిన వర్షంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. పంటలు దెబ్బ తినడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పవని వాపోతున్నారు. ముఖ్యంగా మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయినట్టు చెబుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

- నీట మునిగిన పంటలు
- నష్టపోయిన రైతన్నలు
- మొక్కజొన్నకు ఎక్కువ నష్టం
- అర్ధరాత్రి ఈదురుగాలుల బీభత్సం
- నేలకొరిగిన భారీ చెట్లు.. కూలిన గోడలు



శ్రీకాకుళం అర్బన్/అరసవల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి దాటాక ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా వేకువజామున 3 నుంచి 4 గంటల ప్రాంతంలో కురిసిన వర్షానికి నగరంలో పలుచోట్ల భారీ చెట్లు నేలకూలాయి. నిర్మాణంలో ఉన్న ఇళ్ల గోడలు సైతం కూలిపోయాయి. ఆర్టీసీ కాంప్లెక్స్, రైతు బజార్‌తో పాటు నగరంలో పలు రోడ్లు జలమయమయ్యాయి. అర్ధరాత్రి వర్షం కురవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరుగలేదు. రైతు బజారు వెనుక గల ఒక ప్రైవేటు కళాశాల పైకప్పు పూర్తిగా ధ్వంసమై కూలిపోయింది. తహసీల్దారు కార్యాలయం, జెడ్పీ సమీపంలో గల ఇంజనీరింగ్ కార్యాలయం, అటవీ శాఖ కార్యాలయం ఎదుట భారీ చెట్లు నేలకొరిగాయి. మున్సిపల్ కార్యాలయ సిబ్బంది వీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఆర్టీసీ కాంప్లెక్స్ జలమయమైంది. కాంప్లెక్స్ ఆవరణలో మోకాలి లోతున వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో బస్సులు ఎక్కేందుకు, దిగేందుకు ప్రయాణికులు, సిబ్బంది ఇబ్బంది పడ్డారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల అవస్థలు

నేలకొరిగిన వరి

ఎచ్చెర్ల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉరుములు...మెరుపులతో ఆదివారం అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి వరి పంట నేలకొరిగింది. మండలంలోని పాతపొన్నాడ, బింగుపేట, ముద్దాడపేట, గురువుపేట, పంచిరెడ్డిపేట, బొంతలకోడూరు తదితర గ్రామాల్లోని రబీ సీజన్లో సాగుచేస్తున్న వరి పంట నేలకు ఒరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చేసమయంలో అకాల వర్షం తమ కొంప ముంచిందని రైతులు లబోదిబోమంటున్నారు. ఈ ప్రాంతంలోని ఇటుక తయారీ కేంద్రాలకూ వర్షాలతో నష్టం వాటిల్లింది.

సచివాలయంలోకి వర్షపు నీరు


సచివాలయంలోకి చేరిన వర్షపు నీరు

పొందూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తాడివలస గ్రామంలోని సచివాలయంలోకి వర్షపునీరు ప్రవేశించింది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత మండలంలో ఉరుములు.. మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసంది. సచివాలయంలో సెయిలింగ్‌తో పాటు నిర్మాణంలో ప్రమాణాలు పాటించకపోవడంతో వర్షపునీరు లోపలికి చేరింది. సుమారు అర అడుగు వరకు నీరు నిలిచిపోయింది. దీంతో సోమవారం విధులకు హాజరైన సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోటార్‌తో సచివాలయంలో నీటిని బయటకు తరలించారు. గతంలోనూ వర్షాల సమయంలో నీరు సచివాలయంలోకి చేరిందని... ఈ విషయాన్ని ఎంపీడీవో, పంచాయతీరాజ్ డీఈల దృష్టికి తీసుకువెళ్లామని సచివాలయ కార్యదర్శి రాజీవ్ తెలిపారు.

మొక్కజొన్న రైతులకు ఇక్కట్లు


శ్రీముఖలింగంలో మొక్కజొన్న గింజలు తడవకుండా ఇలా...

జలుమూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో మొక్కజొన్న రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి కురిసిన చిరుజల్లులకు పండిన మొక్కజొన్న గింజలు తడిసి అపార నష్టం సంభవించినట్లు రైతులు వాపోతున్నారు. శ్రీముఖలింగం, నగిరికటకం, మెట్టపేట, అచ్యుతాపురం, కత్తిరివానిపేట, మర్రివలస తదితర ప్రాంతాల్లో మొక్కజొన్న పంట విస్తారంగా సాగు చేస్తున్నారు. పంట దశకు వచ్చిన మొక్కజొన్న పంట ఎండబెట్టే సమయంలో అకాల వర్షాలు పడడంతో రైతులు వాటిని భద్రపర్చడానికి అనేక అవస్థలు పడుతున్నారు. వర్షానికి మొక్కజొన్న గింజలు తడిసి భారీ నష్టం సంభవించినట్లు చెబుతున్నారు. ఈ వర్షం వల్ల రబీ వరి పండించే రైతులకు మాత్రం మేలు కలిగించిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కంకి దశలో సాగునీరు అందక ఎండిపోయిన తరుణంలో వర్షం పడడంతో గింజలు ముదిరి రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని వారు తెలిపారు. ఇటీవల ఎండలతో జనం ఇబ్బంది పడుతున్నారు. ఈ సమయంలో వర్షం పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి జనాలు ఊపిరి పీల్చుకున్నారు.


శ్రీకాకుళం నగరంలో ధ్వంసమైన ఓ ప్రైవేట్ కళాశాల పైకప్పు

కూలిన చెట్లు

హిరమండలం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): హిరమండలంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములతో కురిసిన వర్షానికి పిందె దశలో ఉన్న మామిడి పంట నేలరాలింది. అనేక చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. జగన్నాథపురం పాఠశాల ఆవరణలో ఉన్న మూడు బాదం చెట్లు గాలులకు నేలకూలాయి.


జగన్నాథపురం పాఠశాల ఆవరణలో నేలకూలిన బాదం చెట్టు



హృదయాకారంలో పనస

వజ్రపుకొత్తూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బాతుపురం గ్రామానికి చెందిన ఓ రైతు తోటలోని పనస చెట్టుకు హృదయాకారంలో పనసకాయ కాసింది. ఈ కాయను చూసిన యువకులు తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసి... సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ఇలాంటి పనస కాయ చూడడం ఈ ప్రాంతంలో ఇదే ప్రథమమని స్థానికులు చెబుతున్నారు.

చెరకు రైతుకు అన్నీ కష్టాలే!

(ఐదో పేజీ తరువాయి)

జిల్లాలోని పలుచోట్ల యంత్రాలతో చెరకు నుంచి రసాన్ని తీసి.. ఒక్కో గ్లాస్ రూ.20 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. వారు నేరుగా రైతులకు వద్దకు వెళ్లి చెరకును కొనుగోలు చేసి.. నిల్వ ఉంచుతున్నారు.

చెరకు పండిస్తే మంచిదే

చెరకు పంటకు ప్రస్తుతం మంచి డిమాండ్ కనిపిస్తోంది. చెరకు రసం వినియోగం పెరిగింది. బెల్లానికి కూడా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగుకు అవసరమైన పైపులను రాయితీపై అందజేయనుంది. ఈ విధానం ద్వారా పెట్టుబడి తగ్గి లాభాలు వచ్చే అవకాశం ఉంది.

- దుక్క శరత్‌రెడ్డి, ఉద్యానవన శాఖాధికారి, మెళియాపుట్టి

గిట్టుబాటు ధర కల్పించాలి



చెరకు రైతులు పండించాలంటే.. బెల్లానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. ఒకప్పుడు 8 ఎకరాల్లో చెరకు పండించేవాడిని. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం చెరకు రైతులను పట్టించుకోలేదు. దీంతో నష్టాలు ఎదుర్కొని చెరకు సాగు వదిలేశాను. ప్రస్తుత ప్రభుత్వమైనా మద్దతు ధర పెంచుతుందనే ఉద్దేశంతో ఈ ఏడాది 5 ఎకరాల్లో చెరకు సాగు చేపడుతున్నాను. బెల్లం తయారీ కంటే.. అధికంగా రసం తయారు చేసే వ్యాపా రులు చెరకు గెడలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- కోట తిరుపతిరావు, రైతు, గొప్పిలి, మెళియాపుట్టి

ఘనంగా పాసిపోలమ్మతల్లి ఉత్సవాలు


విద్యుత్ అలంకరణ

టెక్కలి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పోలవరం గ్రామంలో తొమ్మిదేళ్ల కు ఒకసారి జరిగే పాసిపోలమ్మతల్లి సంబరాలతో సందడి నెలకొంది. గ్రామమంతా విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మంగళవారం ఊరేగింపునకు గాను సిరిమానును సిద్ధం చేశారు. బంధుగణం, జనసందోహంతో గ్రామం కిటకిటలాడుతోంది. ఈ పండగల సందర్భంగా గ్రామంలో రంగులరాట్నం, జెయింట్ వీల్, రకరకాల ఆట వస్తువుల వద్ద జనం రద్దీగా కనిపిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, పగటి వేషాలు అలరించాయి.


విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన ఈఫిల్ టవర్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయాధికారి సన్యాసినాయుడు, డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ

క్షయరహిత దేశంగా మారుద్దాం

- సీనియర్ సివిల్ న్యాయాధికారి సన్యాసినాయుడు
- ప్రభుత్వాసుపత్రుల్లో అందుబాటులో మందులు
- డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ

అరసవల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): భారత్‌ను క్షయ రహిత దేశంగా మారుద్దామని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బాలమురళీకృష్ణ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి స్థానిక ఏడురోడ్ల కూడలి వరకు చేరుకుంది. అక్కడ ర్యాలీలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశాన్ని పోలియోరహితంగా తీర్చిదిద్దినట్లే... టీబీ రహిత దేశంగా మార్చాలని అన్నారు. అందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని కోరారు. జ్వరం, దగ్గు వంటి లక్షణాలు రెండు వారాల పాటు తగ్గకుండా కనిపిస్తే వెంటనే దగ్గరలో గల ప్రభుత్వాసుపత్రిని సందర్శించాలన్నారు. రోగ నిర్ధారణ జరిగితే ఆరు నెలల పాటు ఉచితంగా అత్యంత నాణ్యత గల మందులను అందజేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా టీబీ నిర్మూలనకు కృషి చేసిన వైద్య సిబ్బందికి, నర్సింగ్ విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. క్షయ వ్యాధికి చికిత్స తీసుకుంటున్న పలువురికి పోషకాహార కిట్లను అందజేశారు. డాక్టర్ తాడేల శ్రీకాంత్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ప్రకాశరావు, డీపీఎంవో వాన సురేష్‌కుమార్, డీపీఆర్‌వో బాలమాన్ సింగ్, ప్రోగ్రాం మేనేజర్ ఆదిలింగం, మంత్రి వెంకటస్వామి, వైద్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొండచీపుర్లతో సిరులు


మెళియాపుట్టి: కట్టలు కడుతున్న మహిళలు

- గిరిజనులకు ఆదాయం
- తక్కువ పెట్టుబడితో లాభాలు
- జీసీసీ సహకరిస్తే మేలు

మెళియాపుట్టి/కొత్తూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండలం సవర కుడ్డబ గ్రామానికి చెందిన సవర మంగయ్య గత ఏడాది 50 సెంట్ల కొండపోడులో కొండ చీపురు పంట వేశారు. మంచి లాభాలు రావడంతో ఈ ఏడాది రెండెకరాలలో చీపురు పంట వేయటంతో దిగుబడి పెరిగింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం వస్తోం ది. అయితే జీసీసీ అధికారులు వీటిని కొనుగోలు చేయక పోవడంతో కొంతమేరకు నష్టపోతున్నామని తెలిపారు.


కొత్తూరు: గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

మెళియాపుట్టి మండలం సవరజాడుపల్లి గ్రామంలో ఉన్న ఉమ్మడి అటవీ భూమిలో సుమారు 10 ఎకరాల వరకు గ్రామస్థులు అందరూ కలిపి కొండ చీపుళ్ల పంటను వేశారు. గత ఏడాది మద్దతు ధర లేక గిరిజనులు నష్టపోయారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత గిరిజనుల ఉత్పత్తులకు ధరలు పెంచటంతో కలిసి వస్తోంది. ఈ ఏడాది కొండ చీపుర్ల ధరలు మూడు విభాగాలుగా విభజించారు. గ్రేడ్-1 కట్ట రూ.45, గ్రేడ్-2 కట్ట రూ.40, గ్రేడ్-3 రూ.35 వంతున జీసీసీ అధికారులు కొనుగోలు చేస్తున్నారు. ఇది గిరిజనులకు కలసి వస్తోంది.

మన ప్రాంతానికి వలస

కొండచీపుర్లకు వినియోగించే గడ్డి జాతి హిమాలయాల్లో ఎత్తయిన ప్రాంతాలు, తూర్పు కనుమల్లో ఎక్కువగా పెరుగుతాయి. మేఘాలయ, అసోం, అరుణాచల్‌ప్రదేశ్, బెంగాల్, సిక్కిం వంటి ప్రాంతాల్లో వీటిని పండించేవారు. మన జిల్లాలో గిరిజనులు సీతంపేట, భామిని, కొత్తూరు, మెళియాపుట్టి, మందస, నందిగాం, టెక్కలి ప్రాంతాల్లో సుమారు 500 ఎకరాల్లో వీటిని సాగు చేస్తున్నట్టు తెలుస్తోంది.

ఎకరానికి రూ.50 వేలు

ఎటువంటి ఉపయోగం లేని ప్రాంతాన్ని చీపురుగడ్డి పెంపకానికి గిరిజనులు వినియోగిస్తున్నారు. ఒక్కో చీపురుకట్ట బయట మార్కెట్‌లో రూ.70 వరకు పలుకుతుంది. కట్టలు కట్టడానికి కూలీలకు రూ.20 వేల వరకు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. అన్ని ఖర్చులూ పోను ఎకరానికి రూ.50 వేల వరకు ఆదాయం వస్తోందని అంటున్నారు.

15 ఏళ్ల పాటు ఆదాయం

ఎత్తయిన కొండవాగు ప్రాంతాల్లో ఈ చీపురు గడ్డి సాగుకు అనుకూలంగా ఉంటుంది. సముద్ర మట్టానికి కనీసం 1500 అడుగుల నుంచి 5 వేల అడుగుల ఎత్తులో ఉండే అటవీ భూముల్లో ఆ గడ్డి సాగుకు అనుకూలంగా ఉంటుందని ఉద్యనవన శాఖ అధికారులు చెబుతున్నారు. గడ్డి 5 నుంచి 12 అడుగుల వరకు పెరుగుతుంది. ఏటా జనవరి నుంచి గడ్డి పెరిగి... మార్చి నాటికి కోతకు వస్తున్నట్టు గిరిజనులు చెబుతున్నారు.

పోడు వ్యవసాయంగా..

గిరిజన ప్రాంతాల్లో ఉన్న బీడు భూములతో పాటు అధికంగా పోడు వ్యవసాయంగా కొండ చీపుర్లను పండిస్తున్నారు. ప్రతి ఇంటికీ చీపుర్లు అవసరం కావడంతో మంచి డిమాండ్ ఉంటోంది. కొంత మంది ఈతరేకులతో చీపుర్లు తయారు చేసుకుంటారు. కానీ అత్యధిక శాతం ఇళ్లలో కొండచీపుర్లనే వినియోగిస్తుంటారు. గతంలో అధికంగా ఒడిశాలో గల రాయగడ, గుణుపూర్, కొరాపుట్ వంటి ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకునే వారు. గత రెండేళ్ల నుంచి జీసీసీ అధికారులు పంట ఉత్పత్తులను పెంచాలనే ఉద్దేశంతో గిరిజనులకు కొండ చీపుర్ల సాగుపై అవగాహన కల్పించారు. దీంతో వీరంతా వీటి సాగుపై దృష్టి పెట్టారు.

దళారులతో దగా

ఆదివాసీలు కొండల ప్రాంతాల్లో పండించే కొండచీపుర్లకు తగిన గిట్టుబాటు ధర ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారుల బారిన పడి మోసపోతూ అధిక ఆదాయాన్ని కోల్పోతున్నారు. దీనిని అధిగమించేందుకు విద్యావంతులైన గిరిజన యువకులు, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిట్టుబాటు ధర కోసం పోరుబాట పట్టేందుకు ఇప్పటికే సమావేశాలు నిర్వహిస్తున్నారు. కొండచీపుర్లను ఇళ్ల వద్ద దళారులు ఒక్కొక్క కట్టను రూ.25 వంతున కొనుగోలు చేస్తున్నారు. బయట మార్కెట్‌లో దళారులు రూ.50 వంతున అమ్మకాలు చేసి అధికంగా ఆదాయం పొందుతున్నారు. కొత్తూరు మండలంలో గొట్టిపల్లి, కొండూరుముటా, సీతంపేటకు సరిహద్దు గ్రామాలు, అల్తి పంచాయితీలోని గిరిజన గ్రామాల్లో సుమారు 180 ఎకరాల్లో కొండచీపుర్లు సాగు చేస్తున్నారు. కొండచీపుర్లు పంటకు మంచి ధరలు పలికే వరకు వేచి ఉండాలన్నా నిల్వ చేసేందుకు తగిన వసతులు లేవు. దీంతో తక్కువ ధరకే అమ్ముకోవలసిన పరిస్థితి ఎదురవుతోంది. మొత్తం పంటను జీసీసీ ద్వారానే కొనుగోలు చేసి ఆదుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

10 వేల కట్టలు కొనుగోలు చేశాం

గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ప్రభుత్వం వచ్చిన వెంటనే చీపుర్లకు మద్దతు ధర పెంచింది. ఈ ఏడాది ప్రారంభంలోనే ఇప్పటి వరకు 10 వేల కట్టలు కొనుగోలు చేశాం. మూడు గ్రేడ్‌లుగా ధరలు ప్రకటించి కొనుగోలు చేశాం.

- నరసింహులు, జీసీసీ మేనేజర్, పాతపట్నం


మెళియాపుట్టి: సవరజాడుపల్లి ప్రాంతంలో చీపురుపంట

29న టీడీపీ జెండా ఎగురవేయండి

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



మాట్లాడుతున్న గొండు శంకర్

అరసవల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 29న నియోజకవర్గంలోని అన్ని డివిజన్లు, పంచాయతీల్లో పార్టీ జెండాను ఎగురవేయాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. సోమవారం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులోగల టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో విస్తృత స్థాయి సమావేశం జరిగింది.ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి 60 మందికి ఇద్దరు చొప్పున కుటుంబ సాధికార సమితులను ఏర్పాటు చేయాలని, డివిజన్ ఇన్‌చార్జిలు, నాయకులను కోరారు. బుధవారం స్థానిక ఏడురోడ్ల జంక్షన్ వద్ద నిర్వహించనున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజేబాబు, నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, అరవల రవీంద్ర, సింతు సుధాకర్, కొర్ను నాగార్జున ప్రతాప్, చిట్టి నాగభూషణరావు, లోపింటి రాధాకృష్ణ, కోరాడ వెంకటరావు, నీర రమణయ్య ఇప్పిలి తిరుమలరావు, కవ్వాడి సుశీల పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి

విద్యార్థులు తమ నైపుణ్యాలను శిక్షణతో పెంపొందించుకొని జీవితంలో అభివృద్ధి సాధించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. సోమవారం శ్రీకాకుళంలోని బలగలో గల డీఎల్‌టీసీ, ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు.

మహిళాభ్యున్నతే ధ్యేయం

● ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్



లబ్ధిదారుకు చెక్కు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మహిళాభ్యున్నతే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధ్యేయమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.వెంకటరావు, ఏపీఎం జి.నారాయణరావు, టీడీపీ నాయకులు తమ్మినేని చం ద్రశేఖర్, నవరి చిన్నారావు, రెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

● ఆమదాలవలస/బూర్జ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని కొంతమంది వైసీపీ చోటా నాయకులు మిడిమిడి జ్ఞానంతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆరోపించారు.సోమవారం బూర్జ మండలంలోని కంట్లాం వద్ద 20 కోట్ల రూపాయలతో నిర్మించనున్న, బూర్జ నుంచి అల్లెన గ్రామానికి కోటి 80 లక్షల రూపాయలతో నిర్మించనున్న బీటీ రహదారి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు, టీడీపీ నాయకులు బగాది రామినాయుడు, రాంజీ, సత్య ప్రసాద్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా యువత ఉండాలి

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

రణస్థలం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పానియాలు, గంజాయి వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. పైడిభీమవరంలో 16 రోజుల పాటు టీడీపీ నాయకుడు రౌతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా 45 జట్లతో టోర్నమెంట్ నిర్వహించారు.ఈ సందర్భంగా సోమవారం నాతవలస, వరిసాం మధ్య ఫైనల్ మ్యాచ్ జరి గింది. ఈమేరకు నాతవలస విజయం సాధించగా, వరిసాం రన్నర్‌గా నిలిచింది. నాతవలసజట్టుకు ఎమ్మెల్యే ఈశ్వరరావు బహుమతి ప్రదానంచేశారు.కార్యక్రమంలో నాయకులు గొర్లె లక్ష్మణరావు, పిసిని హరి, కనకారావు, గొర్లె సాయి పాల్గొన్నారు.



నాతవలస జట్టుకు బహుమతి అందజేస్తున్న ఈశ్వరరావు

ప్రథమ చికిత్సపై అవగాహన అవసరం

అరసవల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రథమ చికిత్సపై ప్రజలకు అవగాహన అవసరమని సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. శ్రీకాకుళంలోని రెడ్‌క్రాస్ భవనంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎనిమిది రోజుల సీనియర్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమం జరుగుతోంది. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ జగన్మోహనరావు, ఎం.ప్రసాదరావు, రెడ్‌క్రాస్ సిబ్బంది సత్యనారాయణ, పి.చైతన్యకుమార్, జి.రమణ, గుణాకరరావు పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రల సమస్యలను పరిష్కరించాలి

అరసవల్లి, మార్చి24(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమిత్రల సమస్యలను పరిష్కరించాలని ఏపీఆరోగ్యమిత్ర కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు చిన్నారావు కోరారు. 17 ఏళ్లుగా పనిచేస్తున్నా క్యాడర్ అమలుజరగలేదని, ఎంటీఎస్, ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగిగా గుర్తింపు లేకపోవడంతో ఆరోగ్యమిత్రలు, టీంలీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్లు, సీసీడీఈవోలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద ఏపీ వైద్యసేవ కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు చిన్నారావు, తవిటినాయుడు, జి.శ్రీను, ప్రమీల పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలు..

ఆమదాలవలస,మార్చి24(ఆంధ్రజ్యోతి):మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మునిసిపల్ కార్మికుల సంఘం అధ్యక్షుడు తాడి సంతోష్ కోరారు. సోమవారం పురపాలక సంఘ కార్యాలయంలో మేనేజర్ బిషోయ్‌కు వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూ ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్న కల్లేపల్లి శ్రీను కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, ఇటీవల మృతి చెందిన కళ్యాణి సింహాచలం కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు ఎస్.రాజేష్, ఎ.శ్రీనివాస్, కె.తారక, డి.రాజేష్ పాల్గొన్నారు.

మే 31లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయండి

ఇచ్ఛాపురం, మార్చి24(ఆంధ్రజ్యోతి): వివిధ దశల్లో 2019-24 డిసెంబరు10లోగా నిలిచిపోయిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్లను మే31 నాటికి పూర్తి చేయాలని సోషల్ డవలప్‌మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావు తెలిపారు. సోమవారం ఇచ్ఛాపురంలోని మెప్మా కార్యాలయంలో 40మంది ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ75వేలు, ఆదివాసీ గిరిజనులకు రూ.లక్ష వరకు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలి

ఇచ్ఛాపురం, మార్చి24(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలని సీఎం ఆశిస్తున్నారని ఏపీఎం ఎస్.ప్రసాద్ తెలిపారు.స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు సంఘనిధి సంఘానికి మూలాధారం అన్న అంశంపై అవగాహన కల్పించారు.

ఆర్వోబీల మంజూరుపై హర్షం

కంచిలి, మార్చి24(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నుంచి పలాస రైల్వేస్టేషన్ల మధ్య ఈస్టుకోస్ట్ రైల్వే జోన్ పరిధిలో12 ఎల్‌సీ గేట్ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు(ఆర్వోబీ) మంజూరుకావడంపై జడ్ఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాస రౌళో హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆర్వోబీలు మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం కంచిలి ఎల్‌సీ గేటును పరిశీలించారు.

ఇచ్ఛాపురంలో పీ-4పై అవగాహన

ఇచ్ఛాపురం, మార్చి24(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మునిసిపాలిటీలోని 21, 22 వార్డుల పరిధిలో గల సచివాలయంలో ప్రజలకు సోమవారం పి-4పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్, 22వ వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. .

పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ బహిష్కరణ

గుజరాతీపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయుల అక్రమ సస్పెన్షన్లు వెంటనే రద్దు చేయాలని, కుప్పిలి మోడల్ స్కూల్ విద్యార్థులకు న్యాయం చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. సోమవారం శ్రీకాకుళంలోని ఎన్జీవో హోంలో ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య జిల్లా కమిటీ సమావేశం చౌదరి రవీంద్ర అధ్యక్షతన జరిగింది. పీఆర్టీయూ, ఏపీటీఎఫ్-257, 1938, ఎస్టీయూ, డీటీఎఫ్, హెచ్ఎంఏ ఆపస్, బీటీఏ, ఎస్సీ ఎస్టీయూఎస్, పీఈటీపీడీ అసోసియేషన్,ఎస్ఎల్‌టీఏ, ఆర్‌యూపీపీ, ఎల్ఎఫ్ఎల్, హెచ్ఎంఏల ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు సమక్షంలో ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ఎన్జీవో హోం నుంచి డీఈవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ, బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు డీఈవో కార్యాలయం వద్ద ధర్నా, 27న సాయంత్రం నాలుగు గంటలకు కలెక్టరేటట్ వద్దధర్నా, 29న డీఈవో కార్యాలయం ముట్టడించాలని నిర్ణయిం చారు. ఏప్రిల్ మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్ ప్రక్రియ బహిష్కరించనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. సమావేశంలో సంఘాల నాయకులు టి.మురళీమోహన్,ఎం.మదన్మోహన్, బి.శ్రీరామ్మూర్తి, బి.వెంకటేశ్వర్లు, పి.కృష్ణారావు, ఎస్వీరమణ, కె.రంగనాయకులు, డి.శివరాం ప్రసాద్, బి. రమేష్ పాల్గొన్నారు.

● పొందూరుమార్చి24(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయులపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కుప్పిలిలో పదో తరగతి పరీక్ష కేంద్రంలో మాస్‌కాపీయింగ్‌కు సహకరిస్తున్నారన్న ఆరోపణలతో 14 మంది ఉపాధ్యాయులను బాధ్యులను చేస్తూ సస్పెండ్‌చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ సంఘాల ఆదేశాల మేరకు మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు సోమవారం నల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు.

శుద్ధ జలాలను చిదిమేశారు!

(ఐదో పేజీ తరువాయి)

కోసంఅవస్థపడుతున్నారు.బోర్లు,బావుల నీరుతాగి అస్వస్థతకు గురవుతున్నారు.

● హడావుడిగా శంకుస్థాపన

2023 డిసెంబరులో అప్పటి సీఎం జగన్ కంచిలి మండలంలో ఉద్దానం సమగ్ర మంచినీటి పథకానికి హడావుడిగా శంకుస్థాపన చేశారు. కానీ ఈ పథకం పనులు కొలిక్కి రాలేదు. చాలా గ్రామాలకు ఇంతవరకూ పైపులైన్లు వేయలేదు. ఆ పథకం అందుబాటులోకి వచ్చింది కదా అని ఎన్టీఆర్ సుజలధార పథకాన్ని పూర్తిగా గాలికొదిలేశారు. ఉద్దానం సమగ్ర మంచినీటి పథకం అందుబాటులోకి వచ్చేసరికి దాదాపు ఏడాది పడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో 20 లీటర్ల క్యాన్ ధర రూ.2 ఉండగా.. నిర్వహణ వ్యయం పేరిట వైసీపీ సర్కారు దానిని రూ.7కు పెంచింది. ప్రజలపై అదనపు భారం మోపింది. ధర పెంచినా వాటి నిర్వహణలో మాత్రం వైసీపీ సర్కారు పూర్తిగా విఫలమైంది. ఉద్దానం ప్రజలకు శాపంగా మారింది.

అర్జీలను పరిష్కరించండి: కలెక్టర్



అర్జీలను స్వీకరిస్తున్న స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అర్జీల నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 162 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ పద్మావతి, డీఆర్వో ఎం.వేంకటే శ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాన్స్‌జెండర్లు

అరసవల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి):ట్రాన్స్‌జెండర్ దీపు హత్య కేసులో నిందితుడు దుర్గాప్రసాద్ అలియాస్ బన్నీకి ఉరిశిక్ష విధించాలనిట్రాన్స్‌జెండర్లు డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు కొవ్వొత్తులతో నిరసనప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యురాలు ఎల్.అనూష్క మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా బయ్యవరం రహదారిపై ఉన్న కల్వర్టు వద్ద ఈనెల 19నట్రాన్స్‌జెండర్ దీపును ప్రేమపేరుతో మోసం చేసిన కాకినాడకు చెందిన దుర్గాప్రసాద్ అలియాస్ బన్నీ ముక్కలు ముక్కలుగా నరికి భౌతిక కాయాన్ని మూడుప్రాంతాల్లో పడేసిన ఘటన కలిచి వేసిందన్నారు

బాధితులకు న్యాయం చేయండి: ఎస్పీ



వృద్ధురాలితో మాట్లాడుతున్న మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదు నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన వినతులను త్వరగా పరిష్కరించాలని కోరారు. సోమవారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన 50 ఫిర్యాదులను అర్జీదా రుల నుంచి స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.బాధితుల సమక్షంలో సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందేలాచేయాలని, చట్టపరిధిలో బాధితులకు పరిష్కారంచూపాలని సూచించారు.

బెట్టింగ్‌లు నిర్వహిస్తే సస్పెక్ట్ షీట్

జిల్లాలో ఎవరైనా బెట్టింగులు నిర్వహించినా, ఊబిలోకి అమాయకులను లాగాలని ప్రయత్నించినా వారిపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేస్తామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. సోమవారం శ్రీకాకుళం విలేకరులతో మాట్లాడుతూ బెట్టింగ్‌లతో యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న వారిపై, గతంలో పాల్పడిన వారిపై, అనుమానితులపై నిఘా ఉంచామని, యువత బెట్టింగ్ యాప్‌ల జోలికి పోవద్దని హెచ్చరించారు. ఎక్కడైనా బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిస్తే 112/100 నెంబర్‌కు కాల్‌చేసి సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన

జి.సిగడాం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.సిగడాం, బాతువ పీహెచ్‌సీల పరిధిలోగల గ్రామాల్లో సోమవారం క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జి.సిగడాం, బాతువ వైద్యాధికారులు యశ్వంత్, అనూష, ప్రతిష్ఠశర్మ, సుమబిందు ప్రజలకు క్షయ నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేయించారు.

హెచ్‌డీఎఫ్ నిధుల వినియోగానికి గ్రీన్‌సిగ్నల్

పొందూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పొందూరు సీహెచ్‌సీలో హెచ్‌డీఎఫ్ ఖాతాలో నిధుల వినియోగానికి పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. మూలుగుతున్న నిధులు శీర్షికతో ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితంకావడంతో రవికుమార్ స్పందించారు.ఈ మేరకు హెచ్‌డీఎఫ్ ఖాతాలో ఉన్న రూ.ఐదు లక్షలతో అవసరమైన పరికరాలు, మరమ్మతులకు వినియోగించాలని ఛైర్మన్‌గా ఆదేశాలిచ్చారు. దీంతో ఆ నిధులతో నెలాఖరులోగా అవసరమైన పరికరాలు కొనుగోలుచేసి మరమ్మతులు నిర్వహిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత తెలిపారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

గార, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.మత్స్యలేశం, గార పదో తరగతి పరీక్ష కేంద్రాలను సోమవారం జిల్లా ఉప విద్యాశాఖాధికారి విజయకుమారి, ఎంఈవోలు ఎస్.రామకృష్ణ, టి.వినోదిన పరిశీలించారు. కేంద్రాల వద్ద మంచినీరు అందుబాటులో ఉంచాలని, గదుల్లో వెలుతురు బాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మెడికవర్‌లో రెండేళ్ల బాలికకు ఎండోస్కోపిక్ చికిత్స

● కాలి పట్టీ మింగడంతో బయటకు తీసి ప్రాణాలు కాపాడిన వైద్యులు



ఎక్స్‌రేలో కనిపిస్తున్న కాలిపట్టీ

అరసవల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని రెండేళ్ల బాలిక మింగేసిన ఓ కాలిపట్టీని మెడికవర్‌లో ఎండోస్కోపిక్ చికిత్స ద్వారా తీసి ప్రాణాలు కాపాడారు. వైద్యుల కథనం మేరకు.. శ్రీకాకుళంలోని రెండేళ్ల బాలిక అనుకోకుండా కాలిపట్టీని మింగడంతో మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు. ఎక్స్‌రే తీసిన వైద్యులు ఎగువ జీర్ణవ్యవస్థలోకి చేరి డ్యుయోడినమ్ మూడోభాగంలో చిక్కుకున్నట్లు గుర్తించారు. ఆ వస్తువు ఆహార నాళంలోకి కాకుండా వాయుమార్గంలోకి ప్రవేశిస్తే అది ప్రాణాపాయానికి దారితీయవచ్చి నిర్ధారణకు వచ్చారు. దీంతో మెడికవర్ ఆసుపత్రి గ్యాస్ట్రో నిపుణుల బృందం ఎండోస్కోపిక్ స్నేర్‌ను ఉపయోగించి, సున్నితమైన ప్రక్రియ ద్వారా మింగేసిన వస్తువును సురక్షితంగా బయటకు తీశారు. శస్త్రచికిత్స అవసరం లేకుండా ఎంతో నైపుణ్యంతో ఈ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ చైతన్య మాట్లాడుతూ చిన్నపిల్లలు వస్తువులను మింగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అధునాతన ఎండోస్కోపిక్ పద్ధతులను ఉపయోగించి బయటకు తీసినట్లు చెప్పారు. బాలిక తల్లిదండ్రులు, బంధుమిత్రులు వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మట్టి తరలించి.. మొక్కలు తొలగించి

● బీలలో యంత్రాలతో పనులు చేపట్టిన రైతులు



కొత్తపాలెం వద్ద బీల కాలువలో బురద మట్టిని తోడుతున్న యంత్రం

కవిటి, మార్చి24 (ఆంధ్రజ్యోతి): బట్టివానిపాలెం నుంచి కవిటి బీల వరకూ గల కాలువను రైతులే యంత్రాలతో అభివృద్ధి చేయిస్తున్నారు. అక్కడ లభ్యమైన మట్టిని కొబ్బరి తోటల్లో వేస్తే ఎరువుగా ఉపయోపడుతుందని తరలిస్తున్నారు. కాలువలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు.రబీలో ఇక్కడ సుమారు 100 మంది రైతులు 50 ఎకరాల్లో వరి, చోడి సాగుచేశారు. బీలబట్టికి కొత్తపాలెం నుంచి ఇద్దివానిపాలెం వరకు ఉన్న కాలువ ద్వారా సాగునీరు బీలలో కలిసిపోయి ప్రవాహం పెరిగితే సముద్రంలో కలుస్తోంది. సుమారు నాలుగు కిలోమీటర్లు పరిధిలోకాలువలో మొక్కలు, మట్టి పేరుకుపోవడంతో పంట పొలాలకు చుక్కనీరుఅందడం లేదు.దీంతో జగతి, బెజ్జిపుట్టుగ పంచాయతీల పరిధిలో కొందరు రైతులు బట్టివానిపాలెం నుంచి కవిటి వరకు గల కిలోమీటరున్నర పరిధిలో కాలువలో చెత్త, షిల్ట్ తొలగిస్తున్నారు.ఈ చెత్తను కొబ్బరి రైతులు తమ తోటలకు కొంత డబ్బులు యంత్రాలతో తొలగిస్తున్నవారికి చెల్లించి తరలిస్తున్నారు. కాగా ఉపాధి పథకం కింద గొనామరిగెడ్డ కాలువలు మెరుగుపరచాలని ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని ఏపీవో మోహనరావు తెలిపారు. అనుమతులు రాగానే పనులు చేసేందుకు వీలు కలుగుతుందని చెప్పారు.

నేడు మునిసిపల్ వేలం పాటలు

ఇచ్ఛాపురం, మార్చి24(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మునిసిపాలిటీ పరిధిలో 2025-26సంవత్సరానికి రోజువారీ మార్కెట్, వీధి గుత్త, కబేళా,కొబ్బరి చెట్ల ఫలసాయం, లైబ్రరీలోని పాత వార్తాపత్రికలకు వేలంపాటలు మంగళవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు.ఈనెల 20న జరగాల్సినపాటలు వాయిదాపడిన విషయం విదితమే.

నేటి నుంచి శిక్షణ తరగతులు

జి.సిగడాం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): సంతవురిటి ఉన్నత పాఠశాలలో పోషన్ బీ, పడాయి బీ అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ తమ్మినేని లక్ష్మి తెలిపారు.మూడు సెక్టార్ల పరిధిలో గల 73మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక విధానంపై చర్చకు సిద్ధం

ఆమదాలవలస, మార్చి24 (ఆంధ్రజ్యోతి):ఇసుక విధానం, ప్రభుత్వ పథకాలు, రాష్ట్రాభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నామని టీడీపీ జిల్లా కార్యవర్గ కార్యదర్శి సనపల ఢిల్లీశ్వరరావు తెలిపారు. ఆమదాలవలసలో టీడీపీ పట్టణాధ్యక్షుడు ఎస్.మురళీధర్, మండలాధ్యక్షుడు నూకరాజు, రమణమూర్తితో కలిపి విలేకరులతో మాట్లాడారు.రాష్ట్రాభి వృద్ధితోపాటు సంక్షేమ పథకాలు సక్రమంగా అమలుచేస్తున్న ప్రభుత్వం, ఎమ్మెల్యే రవికుమార్‌పై స్థాయిలేని చింతాడ రవికుమార్ విమర్శించడం మానుకోవాలన్నారు.కార్యక్ర మంలోగోవిందరావు, మురళీధర్‌యాదవ్, సంజీవ్ పాల్గొన్నారు.





అంతా రివర్స్..!

- పగలు వెలుగులు.. రాత్రి చీకట్లు
- ఇదీ నందిగాం అండర్ పాసేజ్ వద్ద పరిస్థితి


అండర్ పాసేజ్ కింద ఉదయం వెలుగుతున్న లైట్లు

నందిగాం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నందిగాం జాతీయ రహదారి అండర్ పాసేజ్ పగలు వెలుగులు, రాత్రి చీకట్లతో దర్శనమిస్తోంది. నిత్యం జన సంచారంతో ఉన్న ఈ వంతెన కింద రాత్రి అంధకారంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పం దించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


రాత్రి సమయంలో అంధకారం

22 కిలోల గంజాయి స్వాధీనం

- ఒడిశాకు చెందిన వ్యక్తి అరెస్ట్


మాట్లాడుతున్న కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు

పలాస, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకువస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 22 కిలోలు స్వాధీనం చేసుకున్నట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లా డుతూ వివరాలు వెల్లడించారు. ఈ మేరకు.. ఒడిశా రాష్ట్రం ఆర్.ఉదయగిరి తాలూకా టిక్క మాల గ్రామానికి చెందిన ఆమోద్ ఆనంద్‌కు అదే గ్రామానికి చెందిన కబు ఆనంద్‌తో బంధుత్వం ఉంది. కబు ఆనంద్ ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి ముంబైలో విక్రయిస్తుంటాడు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన నిఖిల్‌పాణితో కలిసి ఆమోద్ ఆనంద్ సోమవారం గంజాయిని తరలిస్తుం డగా పలాస రైల్వే స్టేషన్ వద్ద సీఐ పి.సూర్యనారాయణ సిబ్బందితో కలిసి పట్టుకున్నారన్నారు. అయితే నిఖిల్‌పాణి పరారు కాగా ఆనంద్‌ను అరెస్ట్ చేసి పలాస కోర్టులో హాజరుపరిచామన్నారు. మాదక ద్రవ్యాల రవాణాపై నిఘా పెట్టామని, అన్ని మార్గాల్లో సిబ్బంది పహారా ఉన్నారన్నారు. గంజాయి తీసు కున్నా, రవాణా చేసినా తమకు సమాచారం అందించాలని కోరారు. సమా వేశంలో సీఐ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కంచిలి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జాడుపూడి వద్ద జాతీయ రహదారి పై ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బురదపాడు గ్రామానికి చెందిన కప్ప జగ్గయ్య రెడ్డికి గాయాలయ్యాయని కంచిలి ఎస్ఐ పి.పారినా యుడు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. పురుషోత్తపురం పంచాయతీ పరిధిలో గలబురదపాడు గ్రామానికి చెందిన జగ్గయ్యరెడ్డి హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. కొల్లూరులోని తన తాతగారి ఇంటికి రెం డు రోజుల ఉండేందుకు శనివారం వచ్చాడు. ఆదివారం రాత్రి దాబాలో భో జనం చేసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఆ సమయంలో జాడు పూడి జంక్షన్ వద్ద రోడ్డు దాటే సమయంలో ఇచ్ఛాపురం నుంచి పలాస వె ళ్తున్న కారు జగ్గయ్య రెడ్డి ద్విచ క్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో జ గ్గయ్య రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో 108లో ఇచ్ఛాపురం ప్రభుత్వాసుప త్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రపంచ కవితా దినోత్సవంలో వినోద్‌కు పురస్కారం


కుత్తుమ వినోద్‌కు పురస్కారం అందిస్తున్న ఆచార్య ఎస్.గోపి

పలాసరూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన కవిసంధ్య సాహిత్యసాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్దానానికి చెందిన ప్రజాకవి కుత్తు మ వినోద్‌కు పురస్కారం అందించారు. కవిత, సామాజిక వైవిధ్యం అనే అంశంలో ప్రసంగించినందుకు ఈ పురస్కారాన్ని కేంద్రసాహిత్య అవార్డు గ్రహీత ఆచార్య ఎస్.గోపి అందించి అభినందించారు. అలాగే నిర్వాహకులు, కవిసంధ్య సంపాదకులు శిఖామణి, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, కవి దర్భశయనం శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి డిగ్రీ కళాశాలలో ఈగల్ క్లబ్ ఏర్పాటు


ఈగల్ క్లబ్ విద్యార్థులతో ప్రిన్సిపాల్ గోవిందమ్మ తదితరులు

టెక్కలి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమ వారం ఈగల్ క్లబ్‌ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలు విని యోగం వల్ల కలుగు దుష్ప్రభావాలపై పోస్టర్ ప్రజెంటేషన్ చేసి అవగాహన కల్పించారు. డ్రగ్స్‌ను వ్యతిరేకిస్తూ విద్యార్థులు ప్రచారం చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ అన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ కుమార్, లూకపాల్, డాక్టర్ ప్రవీణ్, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు చేయాలి

హిరమండలం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తంప గ్రామ పంచాయతీలో సర్పంచ్ మామిడి గణపతి నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ భార్య ఇదే పంచాయతీలో కార్యదర్శిగా పనిచేస్తు న్నారని, ఆమె తీర్మానంతో పంచాయతీలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయకుండానే 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.4 లక్షలు దుర్విని యోగం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు ఎలాంటి పదవులు లేనప్పటికీ ఉపసర్పంచ్‌గా ఆన్‌లైన్ లాగిన్‌లో పేరు నమోదు చేసి తన ఆమోదం మేరకు నిధులు డ్రా చేసినట్లు చూపించారని గ్రామానికి చెందిన రిటైర్డ్ పోలీస్ అధికారి ఎం.చిన్నబాబు తెలిపారు. నిజమైన ఉప సర్పంచ్‌ను లాగిన్ నుంచి తొలగించారన్నారు. ఈ విషయం తనకు తెలియదని, గ్రామం లో కొందరు యువకులు పంచాయతీలో జరుగుతున్న అక్రమాలను బయట పెట్టారన్నారు. తగు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయనతో పాటు బలగ మధు, ఖాగేశ్వరరావు తదితరులు కోరారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు

పోలాకి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గంగివలస కేజీబీవీలో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరోతగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి జె.శారద తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 11వ తేదీలోగా దర ఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్, రేషన్ కార్డులతో పాటు ఉత్తీర్ణత ధ్రువ పత్రాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఇంటర్ బైపీసీలో చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణతా పత్రం, టీసీ, ఆధార్, రేషన్, ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే కేజీబీవీలో ఖాళీగా ఉన్న మిగులు సీట్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సైనిక్‌నగర్ అభివృద్ధికి చర్యలు తీసుకోండి

టెక్కలి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తొలు సూరుపల్లి పంచాయతీ సైనిక్ నగర్‌లో కాలువలు, రోడ్లు, తాగునీరు సౌకర్యం లేక ఇబ్బం దులు ఎదురవు తున్నాయని తగు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు బూరె నరేంద్ర, జన్ని పరమేశ్వరరావు, జర్జాన రామ్‌జీ కోరారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో ఎం.కృష్ణ మూర్తికి వినతిపత్రం అందించారు. కాలనీలోని రోడ్లు పారిశుధ్యలోపంతో దుర్గంధం వెదజల్లుతున్నాయని ఆయ న దృష్టికి తీసుకు వెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజ్‌కుమార్ రెడ్డి, శ్రీను, గోపి, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరందిస్తాం

- ఎమ్మెల్యే గౌతు శిరీష


పవర్‌బోర్ కుళాయిలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికీ తాగునీరందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక ఎల్లమ్మవీధిలో సోమవారం రూ.5 లక్షలతో నిర్మించిన పవర్ బోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ.. ఉద్దానం రక్షిత నీటి పథకాన్ని పలాస-కాశీబుగ్గ పట్టణానికి రప్పించామని, త్వరలో పనులు పూర్తి చేసి పూర్తిస్థాయిలో నీరంది స్తామన్నారు. ఇప్పటికే మునిసి పాలిటీ నిధులు రూ.63 లక్షలు పైపులైన్ల కోసం ఖర్చు చేస్తున్నా మని, టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న ఉద్దా నం ట్యాంకు లకు పైపులైన్లను అనుసంధానం చేసి ప్రతిరోజు ఐదు ఎంఎల్‌టీల నీరు ఇచ్చేందుకు అధికారులు అంగీకరించారన్నారు. దీంతో పాటు అదనంగా ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశామని, ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నీటి సరఫరా చేస్తామ న్నారు. ప్రభుత్వ ఐటీఐ రోడ్డు, మంకినమ్మ ఆలయం వద్ద అభివృద్ధి పనుల్లో ఆమె పాల్గొన్నారు. కార్యక్ర మంలో ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వర రావుయాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, మల్లా శ్రీనివాస్, టంకాల రవిశంకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు వివరించండి

- కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట నియోజకవర్గ సమస్యలను సీఎం నారా చంద్రబాబు అధ్యక్షతన జరగనున్న కలెక్టర్ల సదస్సులో వివరించాలని ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి సమస్యలను వివరించారు. వంశధార కాలువల షట్టర్లు మరమ్మతులు, గార-వనితమండలం వంతెన నిర్మాణం పనులు, పొలాల్లో మిగులు ధాన్యం కొనుగోలు, తాగునీటి సమస్యలు, రోడ్లు, కాలువల సమస్యలతో పాటు నర సన్నపేట పట్టణాన్ని మోడల్‌గా తీర్చిదిద్దాల్సిన ఆవశ్యతను వివరించారు. కార్యక్ర మంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నరసన్నపేట నియోజకవర్గ టీడీపీ స మన్వయకర్త బగ్గు అర్చన పాల్గొన్నారు.


కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి

- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా తాగునీటిఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో జడ్పీ సీఈవో ఎల్‌వీఎన్ శ్రీధర్ రాజా తదితర అధికారులతో సమీక్షిం చారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి తగు చర్యలు చేపట్టాలన్నారు. ● నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలకు చెందిన బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు సీఎంఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిన జడ్పీటీసీ



మెళియాపుట్టి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ జడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య ఆదివారం రాత్రి ఆ పార్టీ నుంచి టీడీపీలో చేరారు. ఈ మేరకు ఆయనకు ఎమ్మె ల్యే మామిడి గోవింద రా వు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కొత్తూ రు, వెంకటాపురం సర్పంచ్‌లు బెజ్జి జయ్యమ్మ, గూడ వసంతకుమారి టీడీపీలో చేరారు. ప్రస్తుత ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి పాటుపడుతున్నందున టీడీపీ లో చేరినట్లు వారు తెలిపారు. అయితే పార్టీలో చేరికపై కొందరు వ్యతిరేకంగా సోమ వారం సమావేశం నిర్వహించినట్లు సమాచారం. పార్టీ నేతలకు తెలుపకుండా చేర్పు కోవడాన్ని కొందరు వ్యతిరేకిస్తున్నారు.

ఉపాధి పని కల్పించాలి


నిరసన తెలుపుతున్న ఉపాధి వేతనదారులు

నందిగాం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఉపా ధి పనులు కల్పించాలని చెరుకుపల్లి గ్రామా నికి చెందిన వేతనదారులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఏపీ వ్యవసాయ కార్మి క సంఘం నేతృత్వంలో గ్రామంలో నిర సన చేపట్టారు. గురువారం నుంచి పను లిచ్చి జీవనోపాధి కల్పించాలని నినదించారు. ఏడా దికి 200 రోజులు పనులివ్వాలని, రోజు వారీ వేతనం పెంచాలని కోరారు. కార్యక్ర మంలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధి పి. సాంబమూర్తి, సభ్యులు ఆర్.సీతారాం, జయ మ్మ, పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష రాస్తూ స్పృహ తప్పిన విద్యార్థిని

మెళియాపుట్టి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పెద్దమడి గిరి జన బాలికల పాఠశాలలో సోమ వారం పదోతరగతి గణి తం పరీక్ష రాస్తున్న విద్యార్థిని శ్వేత ఒక్కసారి స్పృహతప్పి పడిపోయింది. దీంతో వెంటనే స్థానికంగా ఉన్న ఆర్ఎం పీని తీసుకువచ్చి వైద్యసేవలు అందించారు. ఒక్కసారి ఉన్నట్టుండి పడిపోవడంతో సిబ్బంది ఆందోళన చెందారు. విద్యార్థిని కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోం దని, నీరసం వల్ల పడిపోయినట్లు వైద్యులు తెలిపారు. ప్రాథమిక వైద్యం అనంతరం పరీక్ష రాశారన్నారు.


స్పృహ కోల్పోయిన విద్యార్థినికి తీసుకువస్తున్న సిబ్బంది

ద్విచక్రవాహనంలో పాము కలకలం


ద్విచక్ర వాహనంలో దూరిన పామును తీసేందుకు ప్రయత్నిస్తున్న యువకులు

నరసన్నపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక డీసీసీబీ బ్యాంకు ఉద్యోగికి చెందిన ద్విచక్రవాహనంలో కట్ల పాము దూరి కలక లం రేపింది. సోమవారం రాత్రి ఏడు గంటల సమయంలో విధులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు ద్విచక్రవాహనం వద్దకు రాగా ముందుభాగంలో కట్లపాము కనిపించింది. దీంతో ఆయన కేకలు వేయడంతో పాము ద్వి చక్రవాహనం లోపలికి వెళ్లింది. దాన్ని బయ టకు తీసేందుకు స్థానికులు ప్రయత్నించారు. సుమారు అరగంట తరువాత వాహనం హె డ్‌లైట్ వైర్లకు చుట్టుకున్న పామును గమ నించి స్థానికులు బయటకు తీసి హత మార్చారు.

'యంగ్‌ఇండియా కే బోల్ సీజన్-5'లో విజేతగా ఆజాద్



విజేత ఆజాద్‌కు ప్రశంసాపత్రం, నగదును అందజేస్తున్న జాతీయ యువజన కాంగ్రెస్ ప్రతినిధులు

టెక్కలి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ జాతీయస్థాయిలో నిర్వహించిన యంగ్ ఇండియా కే బోల్ సీజన్-5 ఉపన్యాస పోటీల్లో ఏపీసీసీ యువజన విభాగం నాయకుడు, టెక్కలికి చెందిన పేడాడ చంద్ర శేఖర్ ఆజాద్ విజేతగా నిలిచారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు పాట్నాలో నిర్వహించిన పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. విజేతగా నిలిచిన చంద్రశేఖర్‌కు రూ.50 వేలు నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపికను జాతీయ యువజన కాంగ్రెస్ నాయకులు అందించి అభినందిం చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఆయనను అభినందించారు.

ప్రకృతి ఉత్పత్తులకు అధిక ధరలు పొందాలి


ప్రకృతి సాగు ఉత్పత్తులను పరిశీలిస్తున్న నాబార్డ్ డీజీఎం దేవవ్రత త్రిపాఠి

పాతపట్నం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన ఉత్పత్తులకు అధిక ధరలు పొందేలా ప్రణాళికలు రూపొందించాలని నాబార్డ్ డీజీఎం దేవవ్రత త్రిపాఠి అన్నారు. బ్రెడ్స్ ఆధ్వర్యంలో నాబార్డ్ జీవప్రాజెక్ట్ ఏరియాలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను, సీడ్ బ్యాంకును సోమవారం సందర్శించారు. సారవకోట మండల పరిధిలోని రైవాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ప్రకృతి ఉత్పత్తులకు మంచిధరను పొందితే సుస్థిరత సాధించవచ్చన్నారు. అనం తరం స్థానిక బ్రెడ్స్ కార్యాలయంలో గ్రీన్‌బాండ్ ఎఫ్‌పీవోలు, టీబీవోలు, రైవాడ, రంకిణి, ఇల్లయ్యపురం, కొత్తపేట గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాబార్డ్ జిల్లా డీడీఎం రమేష్ కృష్ణ, బ్రెడ్స్ సీఈవో రామకృష్ణరాజు పాల్గొన్నారు.

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు: డీఈవో

జలుమూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని డీఈవో ఎస్.తిరు మల చైతన్య అన్నారు. తిమడాంలోని పదోతర గతి పరీక్షల కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. అనంత రం తిమడాంలోని ఓ ప్రైవేటు పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల సామ ర్థ్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలను ప్రైవేటు పాఠశాలల యాజ మాన్యాలు పాటించాలని సూచించారు. అలాగే సారవకోట మండలం బు డితి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి ఇన్విజిలేటర్లకు సూచనలు చేశారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డిప్యూటీ డీఈవో

కొత్తూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నివగాం, కొత్తూరుల్లోని పదో తర గతి పరీక్ష కేంద్రాలను టెక్కలి డిప్యూటీ డీఈవో విలియమ్స్ సోమవారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు ఇతర సౌకర్యాలను పరిశీలించా రు. మాస్ కాపీయింగ్‌కు తావివ్వకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ఇతరులెవరినీ పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించవద్దన్నారు. కొత్తూరు ఎం ఈవో గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల రాష్ట్ర సంఘంలో చోటు

- జాయింట్ సెక్రటరీగా 'ఇళ్ల'


మన్మథరావుకు స్వాగతం పలుకుతున్న మాజీ సైనికోద్యోగులు

పలాస/కాశీబుగ్గ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పలాస సంఘ అధ్యక్షుడు ఇళ్ల మన్మథరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం విజయవాడలో సం ఘం రాష్ట్ర ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం పలాస చేరుకున్న మన్మథరావుకు రైల్వే స్టేషన్ వద్ద మాజీ సైనికోద్యోగులు ఘనం గా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. సంఘం రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు సముచిత స్థానం లభించిందని, మాజీ సైనికోద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

వేసవి జాగ్రత్తలు తీసుకోవాలి

హిరమండలం,మార్చి24(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్మాణరంగ, పరిశ్రమల యజమానులు జూన్ నెలా ఖరు వరకు వేసవి జాగ్రత్తలు తీసుకోవాలని అసిస్టెంట్ లేబర్ అధికారి శైలేష్ సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో విధులకు దూరంగా ఉండాలన్నారు. పని ప్రదేశా ల్లో వడ దెబ్బ ఎదుర్కొనేందుకు గాను ప్రథమ చికిత్స కిట్లను అందుబాటు లో ఉంచాలన్నారు. గర్భిణులు, ఆరోగ్య సమస్యలున్న కార్మికులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. పాదరక్షలు లేకుండా పని చేయ వద్దని, పని ప్రదేశాల్లో ఓఆర్ఎస్, ఫ్లూయిడ్స్ ఉంచాలని సూచించారు.

న్యూస్ బాక్స్

31లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

వజ్రపుకొత్తూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఈనెల 31లోగా ఈకేవైసీ చేయించు కోవాలని డీటీ బి.ము రళీకృష్ణ పేర్కొన్నారు. ఈకేవైసీ చేయించు కోకుంటే రేషన్ కార్డులు నిలిచి పోయే అవకాశం ఉందన్నారు. దీనివల్ల ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు నిలిచిపోతా యన్నారు. ఇప్పటికే వీఆర్వోల ద్వారా గ్రా మాల్లో దండోరా వేశామన్నారు

సమస్యలు పరిష్కరించండి



ధర్నా అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగరంపల్లి పంచాయతీలో నెలకొ న్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక సచివా లయం ఎదుట ఆందోళన చేపట్టారు. సీపీఎం జిల్లా నాయ కుడు బమ్మిడి ఆనందరావు మాట్లాడు తూ తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. కుళాయి పైప్‌లైన్లు లీకవడంతో పూర్తి స్థాయి నీరందక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గడచిన ఏడాదిగా వీధిలైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో రాక పోకలకు ఇక్కట్లకు గురవుతున్నారు. శివ రాంపురం వెళ్లే రోడ్డు పనులు నిలిచి పోయాయన్నారు. తగు చర్యలు తీసుకోవా లని సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు.

27న బలద సంత వేలం

కొత్తూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండల పరిషత్ ఆధీనంలో ఉన్న బలద వారపు సంత వేలం పాటను ఈనెల 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.నీరజ ఒక ప్రకటనలో తెలి పారు. 2025-26 సంవత్సరానికి గాను సంత ఆశీలు వసూలుకు గానే ఈ వేలం వేయనున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలానికి గంట ముదు రూ.5000 ధరా వత్తు చెల్లించి పాల్గొనాలన్నారు.

పోలీసు జాగిలంతో తనిఖీలు


దుకాణంలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది

హిరమండలం,మార్చి24(ఆంధ్రజ్యోతి) ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఎస్ఐ ఎండీ యాసిన్ జాగిలంతో దుకాణాల్లో తనిఖీ నిర్వహిం చారు. గంజాయి, మత్తు పదార్థాల రవా ణా, విక్రయాలు నిరోధించేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.

నేడు సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షికోత్సవం

నందిగాం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పెంటూరులో కొలువై ఉన్న సుబ్రమణ్య స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త తెంబూరు మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విశేష పూజలు, హోమం నిర్వహించనున్నామన్నారు. మ ధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేపడు తున్నామన్నారు. ఏవీపీ ఠాగూర్ తదిత రుల నేతృత్వంలో కల్యాణం నిర్వహిస్తున్నా మని, భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రేపు జాబ్‌మేళా

పలాసరూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ, సొసైటీ ఫర్ ఎంప్లా యిమెంట్ జనరేషన్ ఎంటర్ ప్రైజ్ డెవల ప్‌మెంట్ ఆఫ్ ఏపీ (సీడాప్) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా నిర్వ హిస్తున్నట్లు వెలుగు ఏపీఎం జాంబవతి ఒక ప్రకటనలో తెలిపారు. పలాస మండ ల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆరోజు ఉదయం 9.30 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభమవుతుందని, ఫ్యూ జన్ ఫైనాన్స్, బ్లూస్టార్, యూనీఛార్మ్ కంపె నీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహి స్తారన్నారు. అర్హులైన అభ్యర్థులు వారి వయసు, అర్హత ధ్రువపత్రాలతో పాటు రెండు పాస్‌పోర్టు ఫొటోలు, రేషన్ కార్డు, బయోడేటాతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 81065 08318 నెంబరులో సంప్రదించాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.